క్లుప్తంగా

సొంతగూటికి కౌన్సిలర్



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ రాజం మహంత గురువారం సొంతగూటికి చేరారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న మహంత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని వీడి బీఎస్పీలో చేరారు. తిరిగి గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావు సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు.

ప్రభుత్వ విప్ కోలుకోవాలని పూజలు



అడ్లూరికి బొట్టు పెడుతున్న మహేందర్

ధర్మారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ నాయకుడు, యాదవ సొసైటీ చైర్మన్ జంగ మహేందర్‌యాదవ్ గురువారం కుంకుమ, ప్రసాదం, కంకణం అందించారు. మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శక్తిపీఠం జ్యోతిర్లింగం ఉజ్జయిని మహాంకాళేశ్వర ఆలయంలో పూజలు చేయించి అర్చకులు ఇచ్చిన కుంకుమ, కంకణంతో పాటు ప్రసాదం తీసుకొచ్చి లక్ష్మణ్‌కుమార్‌కు అందించారు. పైడిపల్లి మాజీ సర్పంచ్ గంగుల రవీందర్ తదితరులున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో అలివేణి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఎరువులు, పురుగు మందు దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారిణి అలివేణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని నిల్వలు, రిజిస్టర్‌లోని వివరాలను పోల్చి చూశారు. ఎరువులు, పురుగు మందులు కొనే సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. వ్యాపారులు నిబంధనల ప్రకారమే అమ్మకాలు జరపాలని, నిబంధనలు పాటించనివారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో వరి వంట పిలక దశలో ఉందని అన్నారు. ఈ దశలో ఆశించే చీడపీడలను నియంత్రించేందుకు ఎకరాకు 10కిలోల కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్, వేపనూనె క్లోరిపైరిపాస్ కాంబినేషన్ పని చేస్తుందన్నారు.

సాగునీరు అందించాలని వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న గీతారాణి

ముత్తారం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు టూటీఎంసీ శుక్రవారంపేట రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా అడవిశ్రీరాంపూర్ కొత్త చెరువు వరకు కాలువ పూర్తి చేసి ఆ సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆ గ్రామ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి వినతి పత్రం అందజేశారు. కొత్త చెరువు మాటు ద్వారా గ్రామంలోని అన్ని చెరువులను నింపాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఉన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ విశ్రాంత ఉద్యోగి



కొమురయ్యకు సంబంధించిన వస్తువులను అందిస్తున్న 108 సిబ్బంది

మంథని: గుంజపడుగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగి తోట కొమురయ్య గాయపడ్డాడు. రచ్చపల్లి నుంచి గోదావరిఖనికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో 108 అంబులెన్స్ సాయంతో గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కొమురయ్యకు సంబంధించిన బంగారు ఆభరణాలు, పర్సు, ఫోన్‌ను బంధువులకు అప్పగించడంతో.. 108 సిబ్బందిని వారు అభినందించారు.

సల్లంగ చూడమ్మా.. సమ్మక్క..



కమాన్‌పూర్: గుండారంలో సమ్మక్కను తీసుకొస్తున్న కోయ పూజారులు



సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్లలో పూనకంతో భక్తురాలు



రామగుండం: హైకోర్టు ఏజీపీని సత్కరించిన జాతర ఈవో రాజ్‌కుమార్



రామగుండం: వరుసలో భక్తులు

రామగుండం: జిల్లాలో సమ్మక్క–సారలమ్మ జాతర వైభవంగా సాగుతోంది. గురువారం సమ్మక్క గద్దెపైకి రావడంతో.. భక్తులు దర్శనానికి పోటెత్తారు. అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరి ఒడ్డున శ్రీసమ్మక్క–సారలమ్మ జాతర జనసంద్రంగా మారింది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ దంపతులు వన దేవతలను దర్శించారు. హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ) ఎడ్ల రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. జాతర ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజ్‌కుమార్ ఏజీపీని శాలువాతో సత్కరించారు. పారిశుధ్య నిర్వహణపై ఎంపీడీవో ఎంఏ అలీం ప్రత్యేక దృష్టి సారించారు. జాతర ప్రాంగణంలో పారిశుధ్య సిబ్బందితో తిరుగుతూ ఎప్పటికప్పుడు చెత్త, కోళ్లు, మేకల వ్యర్థాలను తొలగిస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు.

సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్ల, గర్రెపల్లి, నారాయణపూర్, తొగర్రాయిలో సమ్మక్కను గద్దెల వద్దకు తీసుకొచ్చారు. గర్రెపల్లి, నారాయణపూర్‌లోని జాతరలో ఎమ్మెల్యే విజయరమణారావు, నీరుకుల్లలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిలువెత్తు బంగారాన్ని సమ్మక్కకు సమర్పించారు.

పెద్దపల్లిరూరల్: హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు తుర్కలమద్దికుంటలో దర్శించుకున్నారు. మద్యం, కూల్‌డ్రింక్స్, కోళ్లను రెట్టింపు ధరలకు విక్రయించారు. మద్యం అమ్మకాలు సాగిస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మామూలుగానే తీసుకున్నారు.

గోదావరిఖని: గోదావరినది తీరంలోని సమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తుల సందడి కనిపించింది. కోయపూజారులు కంకవనం తీసుకొచ్చి శ్రీసమ్మక్క తల్లి గద్దె వద్ద ప్రతిష్టించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



గోదావరిఖని: సమ్మక్క బంగారం తీసుకొస్తున్న భక్తులు

పాలకుర్తి: ఈసాలతక్కళ్ళపల్లి, వేంనూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దర్శించుకున్నారు. కేశోరాం సిమెంట్ కర్మాగారం ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు మొక్కులు చెల్లించారు.

ఎలిగేడు: లాలపల్లి–ఎలిగేడు గ్రామాల సరిహద్దున పెండ్లిపోరుగుట్ట వద్ద సమ్మక్క దేవతను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్టించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కవ్వంపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి అమ్ముల కుమారస్వామి, కోశాధికారి భూర్ల సత్యనారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మారం: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ జాతర గద్దెల వద్ద సందడి నెలకొంది. ఎర్రగుంటపల్లి వద్ద మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పూజలు నిర్వహించారు. బొట్లవనపర్తి వద్ద జిల్లా సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి ఎత్తు బంగారాన్ని పంచి పెట్టారు.

జూలపల్లి: అబ్బాపూర్, తేలుకుంట గ్రామాల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు మొక్కులు చెల్లించారు. జారత కమిటీ అధ్యక్షుడు పసునూటి శ్రీనివాస్, చొప్పరి శేఖర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, శ్యాం, చంద్రయ్య, రాజేశం, వెంకటి, శ్రీనివాస్, జంగిలి లచ్చయ్య, ఎంపీటీసీలు కత్తెర్ల శ్రీనివాస్, దండె వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మీర్జంపేట, పెగడపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తహసీల్దార్ జాహెద్ పాషా, ఎస్సై ఓంకార్ జాతర ప్రదేశాల్లో భక్తులకు అసౌకర్యం లేకుండా చూశారు.

కమాన్‌పూర్: గుండారం, పేంచికల్‌పేట గ్రామాల్లో శివసత్తుల పూనకాలతో జాతర మారుమోగింది. కమాన్‌పూర్ ఎస్సై మామిడాల చంద్రశేఖర్ తన సిబ్బందితో చర్యలు చేపట్టారు. గుండారం, పేంచికల్‌పేట గ్రామాల్లో మంథని ఆర్డీవో హనుమానాయక్ దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ముత్తారం: మైదంబండ, ఖమ్మంపల్లిలో సమ్మక్కను గద్దెపై నెలకొల్పారు. మైదంబండలో మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం–ప్రేమలత దంపతులు మొక్కులు చెల్లించారు.

ఓదెల: కొలనూర్ గ్రామంలో జాతర చైర్మన్ దేవిడి శ్యాంరెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, మాజీ సర్పంచులు మాటురి వెంకటస్వామి, శంకర్, కుంచం మల్లయ్య, పల్లె ఓదెలు, జాతర వైస్ చైర్మన్ కొల్లూరి రాంచంద్రం, పాలకవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ రాత్రి సందర్శించారు.

పొట్టకూటి కోసం..



పెద్దపల్లిరూరల్: పొట్టకూటి కోసం చిన్నారులు ఇలా గాంధీ వేషధారణలో కనిపించారు. హన్మంతునిపేటలోని సమ్మక్క-సారలమ్మ జాతరలో యాచిస్తూ తిరిగారు.



ధర్మారం: బొట్లవనపర్తిలో ఎత్తు బంగారంతో గద్దె వద్ద జిల్లా సొసైటీ ఫోరం చైర్మన్ బలరాంరెడ్డి



కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లిలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



సుల్తానాబాద్‌రూరల్: నారాయణపూర్ జాతరలో భక్తులు



ముత్తారం: మైదంబండలో మొక్కులు చెల్లిస్తున్న మాజీ జెడ్పీటీసీ సదానందం



జూలపల్లి: అబ్బాపూర్‌లో సమ్మక్కను గద్దెపై ప్రతిష్టిస్తున్న కోయ పూజారులు



పెద్దపల్లిరూరల్: హన్మంతునిపేట జాతర ప్రాంగణంలో మద్యం దుకాణం



ఎలిగేడులో మొక్కు చెల్లిస్తున్న భక్తులు



రామగుండం: జాతర ప్రాంగణంలో సూచనలు చేస్తున్న ఎంపీడీవో అలీం

డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలన



డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణాల స్థితిగతులపై స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్‌తో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ చర్చించారు. గురువారం క్షేత్రస్థాయిలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నాణ్యతతో నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టరును ఆదేశించారు. కాగా డ్రైనేజీ నిర్మాణంతో రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న చిరు వ్యాపారుల టేలాలను తొలగించారు. అదే ప్రాంతంలో నైట్ షెల్టర్ పక్కనే రెవెన్యూ శాఖకు చెందిన ఖాళీ స్థలం ఉండడంతో అందులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి డ్రైనేజీ నిర్మాణంలో కోల్పోయిన చిరువ్యాపారులకు ఒక్కో షెట్టరు అప్పగించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రోజూ రైల్వేస్టేషన్ మీదుగా వేలాది మంది రాకపోకలు సాగించనున్న నేపథ్యంలో స్టేషన్ ఎదుట ఏర్పడే ఖాళీ స్థలంలో ఆకర్షణీయమైన కూడలి, వాటర్ ఫౌంటేన్‌తో అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ శ్రీకాంత్, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ తదితరులున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కాల్వశ్రీరాంపూర్ హరిహర దేవాలయంలో చండీ హోమం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ హరిహర దేవాలయంలో గురువారం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. ఉదయం ప్రాతకాల పూజ, నిత్యారాధన, మంత్రపుష్పం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, అన్నసంతర్పన, సాయంకాలం చండీ హోమం, మంగళ హారతులు, తీర్థప్రసాద వితరణ చేశారు. వేదబ్రాహ్మణులు ప్రవీణ్‌శర్మ, సాయివిశాల్‌శర్మ, రఘునాథ శర్మ, ముఖేశ్ మిశ్రా, వ్యవస్థాపక నిర్వాహకులు యెరబాటి రాజేశ్వర్‌రావు, హైకోర్టు న్యాయవాది అశోక్‌రావు దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కిషన్‌రెడ్డి, రఘుపతిరావు, శ్రీశైలం, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఇమ్మడి శ్రీనివాస్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన



అంబేడ్కర్ చౌరస్తా వద్ద రైతు కూలీ సంఘం ప్రతినిధుల నిరసన

రామగుండం: కనీస మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్, హర్యానా సరిహద్దులో శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులపై కేంద్రం రబ్బర్ బుల్లెట్ల వర్షం కురిపించడం హేయమైన చర్యగా అభివర్ణిస్తున్నామని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు చంద్రయ్య అన్నారు. గురువారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు అంతర్గాం జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకొని నినాదాలు చేశారు. కాల్పులు జరిపిన పోలీస్ ఉన్నతాధికారులను సత్వరమే అరెస్టు చేయాలని, అమరుడైన శుభకరన్‌సింగ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సంఘం ప్రతినిధులు కొల్లూరి మల్లేష్, రాజకొమురయ్య, రామస్వామి, రమేశ్, కృష్ణ తదితరులున్నారు.

బొగ్గుబాయి

ఐఎన్‌టీయూసీలో చేరిన హెచ్‌ఎంఎస్ నాయకుడు



కండువా కప్పి ఆహ్వానిస్తున్న జనక్‌ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–1 హెచ్‌ఎంఎస్ సీనియర్ ముఖ్య కార్యకర్త ఎండీ షకీల్ గురువారం ఐఎన్‌టీయూసీలో చేరారు. ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్‌ప్రసాద్ యూనియన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, నాయకులు ధర్మపురి, పోచయ్య, వడ్డేపల్లి దాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెడెన్ పావెల్ జయంతి

గోదావరిఖని: బెడెన్ పావెల్ జయంతిని గురువారం స్థానిక ఆర్సీవోఏ క్లబ్ ముందున్న ఆయన పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. బెడెన్ పావెల్ విగ్రహానికి ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 200 మంది స్కౌట్ అండ్ గైడ్స్‌తో శాంతి ప్రగతి యాత్ర నిర్వహించారు. ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సీనియర్ పీవో బంగారు సారంగపాణి, జ్యోతి, లక్ష్మికుమారి, స్వర్ణలత, వీరారెడ్డి, దుర్గాప్రసాద్, స్కౌట్ మాస్టర్స్ రామచందర్‌రావు, ఎం.గట్టుమల్లు, ఎ.దేవేందర్, కె.బుచ్చయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దినేష్

గోదావరిఖనిటౌన్: అనుమతి లేని అక్షర పాఠశాల పేరుతో కొనసాగిస్తున్న రావూస్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా జిల్లా విద్యాశాఖ అధికారి ఉద్దేశపూర్వకంగానే ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ గురువారం జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) అరుణశ్రీకి గురువారం వినతి పత్రం అందజేశారు. సీబీఎస్‌సీ సిలబస్ అనుమతులు లేకున్నా అక్షర స్కూల్ పేరుతో అక్రమంగా ఇంతకాలం పాఠశాల నిర్వహించారని అన్నారు. ప్రస్తుతం పదోతరగతి బోర్డు పరీక్షలకు కూడా అదే అక్షర పాఠశాల పేరుతో విద్యార్థులను హాజరుపరుస్తున్నారన్నారు. అనుమతి లేని అక్షర పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు డీఈవోను కోరినా ఇప్పటికీ ఎలాంటి చర్యలకు పూనుకోలేదని ఆరోపించారు. విద్యాశాఖ అధికారి రావూస్ యాజమాన్యం వద్ద ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయన్నారు. అనుమతి లేని సదరు పాఠశాలపై చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సంబంధిత విద్యాధికారిపై విచారణ జరపాలని కోరారు.

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వేయొద్దు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: ఇంటి యజమానులు ప్లాస్టిక్‌ను డ్రైనేజీల్లో వేయొద్దని మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు డ్రెయినేజీలతోపాటు పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా నిత్యం చెత్తను తొలగించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని, కాలనీలకు వచ్చే చెత్త వాహనాలకు చెత్తను అందించాలని, రోడ్లు, మురుగు కాలువల్లో పడేయకుండా కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మేధాశక్తి పెంపొందించే ఔషధాలు పంపిణీ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో 16 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఉచితంగా మందులను వికాస తరంగిణి సభ్యులు పంపిణీ చేశారు. గురువారం పుష్యమి నక్షత్రం పురస్కరించుకొని అమృతప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఆయుర్వేద ఔషధం పంపిణీ చేశారు. పరిగడుపున ఈ ఔషధం స్వీకరించినవారికి జ్ఞాపకశక్తి, మేధాశక్తి, రోగనిరోధకశక్తి పెరుగుతుందని, తద్వారా పిల్లల ఆలోచనల్ని పెంపొందిస్తుందని, మాటలు ఆలస్యముగా వస్తున్న పిల్లలకి సహాయపడుతుందని తెలిపారు. 20 నెలలపాటు ఔషధాన్ని తీసుకోవాలని వికాస తరంగిణి ప్రతినిధులు సాదుల సుగుణాకర్–సునీత, పాదిల్లా రమేశ్, జలజ, స్వరూప తదితరులు అన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

రామగిరి: బేగంపేట రాజరాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అర్చక సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఉన్న పెండింగ్ ధూపదీప నైవేద్యాలకు సంబంధించిన బకాయిలను విడుదల చేసినందుకు గాను క్షీరాభిషేకం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. అర్చకులు కొత్తగద్దల శివచందర్, పానకంటి సంతోష్‌శర్మ, సత్యనారాయణాచార్యులు, కృష్ణమాచార్యులు, మురళీధర్‌చారి, విష్ణుచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం చేతిపంపు ఏర్పాటు



చేతిపంపును ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

ధర్మారం: మండల కేంద్రంలోని శీతాలచెరువు వద్ద సమ్మక్క–సారలమ్మ జాతర వద్ద భక్తులకు మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు గాను విశాఖ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన చేతిపంపును ట్రస్టు సభ్యుడు కాడే సూర్యనారాయణ గురువారం ప్రారంభించారు. విశాఖ ట్రస్టు చైర్మన్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కమిటీ సభ్యులు కోరగా.. స్పందించిన వివేక్ వెంకటస్వామి వెంటనే చేతిపంపు ఏర్పాటు చేయించారు.

స్నేహితుడికి చేయూత

సుల్తానాబాద్: పట్టణంలోని పాత జెండా వద్ద నివాసముండే నగునూరి చంద్రశేఖర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. గురువారం జెడ్పీ బాయ్స్ ఎస్‌ఎస్‌సీ 1993–94 బ్యాచ్ సహచర విద్యార్థులు రూ.60వేల ఆర్థిక సాయాన్ని చంద్రశేఖర్ కూతురి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందజేశారు. లింగమూర్తి, భిక్షపతి, రమేశ్, సంతోష్, యుగంధర్, శ్రీధర్, సుధాకర్, సంపత్, అలీ, అశోక్, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ప్రపంచ ఆలోచనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గురువారం విద్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూర్యకుమారి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మహిళలు, బాలికలందరూ తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి, ప్రాధాన్యతా సమస్యలపై చర్చల్లో పాల్గొనడానికి, పరిష్కారాలను అందించడానికి ఒక వేదికను అందించడం ప్రపంచ ఆలోచనా దినోత్సవం ప్రాథమిక లక్ష్యమని అన్నారు. 1926వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న ప్రపంచ ఆలోచనా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. స్కౌటింగ్, గైడింగ్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్, గర్ల్ గైడింగ్, గర్ల్ స్కౌటింగ్ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించిన అతడి భార్య ఒలేవ్ బాడెన్ పావెల్ జన్మదినం సందర్భంగా వారి జ్ఞాపకార్థం ప్రపంచ ఆలోచనా దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభమైందని అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు.

పోలీస్ స్టేషన్ బోర్డుపై ఫోన్ నంబర్



సాక్షి స్పందన

జ్యోతినగర్: పని చేయని పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్లు అనే శీర్షికన సాక్షి జిల్లా పేజీలో ఈనెల 19న ప్రచురితమైన కథనానికి ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ స్పందించారు. పని చేయని ఫోన్ నంబర్ల స్థానంలో ప్రస్తుతం పని చేస్తున్న 8712656526 నెంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉండేలా రాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు సత్వర సేవలను అందించేందుకు పోలీసు వ్యవస్థ పని చేస్తుందని అన్నారు.

నేడు మెజీషియన్స్ డే

కోల్‌సిటీ: ప్రపంచ ప్రఖ్యాత భారతీయ ఇంద్రజాలికులు, పద్మశ్రీ పీసీ సర్కార్(సీనియర్) జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ సౌజన్యంతో జిల్లాకేంద్రంలోని అమర్ చంద్ కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేజిక్ రాజా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మల్లేశం, యతి రాజ్ కాస తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతిఏటా ఒకచోట ఫిబ్రవరి 23న ఇంద్రజాలికుల దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా శుక్రవారం పెద్దపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.